RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260
సంపుటి: 4 సంచిక:137 | మే 27, 2026 | వెల: రూ.3-00



## ఓఆర్ఆర్‌పై ఎయిర్ ఇండియా బస్సుకు మంటలు

చాకచక్యంగా ప్రయాణికులను దింపిన డ్రైవర్

2లో



# ఎబోలాపై సర్కార్ అలర్ట్!

- ఎయిర్‌పోర్టులో కట్టుదిట్టమైన స్క్రీనింగ్
- గాంధీ ఆస్పత్రిలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు
- రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్న మంత్రి దామోదర్

**వేద న్యూస్, హైదరాబాద్**

రాష్ట్రంలో ఇప్పటివరకు ఎబోలా కేసులు నమోదు కాలేదని, ఎబోలా లక్షణాలు ఉన్న వ్యక్తులను కూడా గుర్తించలేదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ఎబోలా విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పూర్తిగా అప్రమత్తంగా ఉందన్నారు. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో నివారణ చర్యలు, ముందస్తు సన్నద్ధతపై మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ

...మిగతా 2వ పేజీలో

## ఖమ్మం కారులో నిస్తేజం!

### చేజారుతున్న కీలక నేతలు, కార్పొరేటర్లు

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గులాబీ పార్టీ పూర్వ వైభవాన్ని తెచ్చుకునేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. గత ఎన్నికల్లో ఎదురైన ఓటములు, కార్పొరేటర్ల వలసలతో నిస్తేజంలో ఉన్న బీఆర్ఎస్ క్యాడర్‌లో నూతనోత్తేజం నింపడానికి గులాబీ బాస్ కేసీఆర్ స్వయంగా 'ఆపరేషన్ ఖమ్మం'కు శ్రీకారం చుట్టారు. జిల్లాలో కాంగ్రెస్ మంత్రులు పొంగులేటి, తుమ్మల, భట్టి విక్రమార్కల హవా కొనసాగుతున్న తరుణంలో, కేసీఆర్ తన నమ్మకస్థుడైన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుకు డిజిటల్ సభ్యత్వ నమోదు బాధ్యతలు అప్పగించి క్షేత్రస్థాయిని పటిష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా గతంలో ఓ వెలుగువెలిగిన ఖమ్మం జిల్లాలో నేడు బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు పక్కపార్టీల వైపు చూస్తుండగా.. క్యాడర్ మాత్రం తమ రాజకీయ భవిష్యత్తుపై బెంగతో ఉన్నారు. కాగా, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌పై మళ్లీ గులాబీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు మరోవైపు సమరశంఖం పూరిస్తున్నాయి.

2లో

- పక్క చూపులు చూస్తున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం
- 'కారు'కు పూర్వ వైభవం తెచ్చేందుకు కేసీఆర్ స్కెచ్
- తక్కెళ్లపల్లి రవీందర్ రావుకు 'డిజిటల్' బాధ్యతలు
- ఉమ్మడి జిల్లాలో జోరు పెంచిన ముగ్గురు మంత్రులు
- అభివృద్ధి, ప్రభుత్వ పథకాలతో ముందుకు..
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న పువ్వాడ, వద్దిరాజు
- ఖమ్మం కార్పొరేషన్‌పై జెండా పాతేందుకు రెండు పార్టీల గురి






## భగీరథ్‌కు మూడు రోజుల పోలీస్ కస్టడీ

- పోక్సో కేసులో మల్కాజ్‌గిరి కోర్టు ఆదేశాలు
- వారం రోజుల కస్టడీ కోరిన పోలీసులకు పాక్షిక అనుమతి
- చర్లపల్లి జైలు నుంచి కస్టడీలోకి తీసుకోనున్న పోలీసులు

2లో

## సెప్టిక్ ట్యాంకులో ఆరుగురు మృతి

- విషవాయువులతో ఊపిరాడక కార్మికుల మృత్యువాత
- ఒక్కరిని కాపాడబోయి వరుసగా ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు
- ఇంటి యజమాని, కుమారుడు సైతం..
- మరో కార్మికుడి పరిస్థితి విషమం
- ఒడిశాలో విషాద ఘటన
- మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున సాయం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం మోహన్ చరణ్

2లో



## ఒకప్పుడు సిరుల మాగాణి.. ఇప్పుడు స్కామ్‌ల గని

- కాంగ్రెస్ పాలనలో సింగరేణి సంక్షోభంలోకి వెళ్లింది
- మాజీ మంత్రి హరీశ్ రావు
- తెలంగాణ భవన్‌లో బొగ్గుగని కార్మిక సమావేశం



**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బొగ్గుగని కార్మిక రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. ఒకప్పుడు సింగరేణి సిరుల గనిగా ఉండేదని, ఇప్పుడు స్కామ్‌ల గనిగా మారిందని హరీశ్ రావు ఆరోపించారు. చంద్రబాబు హయాంలో ఉద్యోగాలు

...మిగతా 2వ పేజీలో

## భూములు తీసుకుంటే.. మా బతుకులు రోడ్డున పడతాయ్

- పరిహారం వద్దు.. భూమే కావాలి
- భూసేకరణ సదస్సులో కన్నీటిపర్యంతమైన రైతులు

2లో

## రూ.30 లక్షల లంచం డిమాండ్.. రూ.2 లక్షలు అడ్వాన్స్!




### ఏసీబీ వలలో షమీర్‌పేట్ తహసీల్దార్

- డ్రైవర్ ద్వారా డబ్బులు స్వీకరిస్తూ పట్టుబడ్డ సుచరిత
- నాలా కన్వర్షన్ వ్యవహారంలో అవినీతి బహిర్గతం
- ఫిర్యాదుదారుడి సమాచారంతో వలపన్ని పట్టుకున్న అధికారులు
- తహసీల్దార్ కార్యాలయం, నివాసాల్లో సోదాలు
- రెవెన్యూ శాఖలో మరోసారి అవినీతి చర్చనీయాంశం
- కేసుపై పూర్తి స్థాయి విచారణ కొనసాగింపు

2లో

## భూ బాధితులకు న్యాయం చేయాలి



- వెలుగుమట్ల, ట్రిపుల్ఆర్, పరిగి బాధితులు ఇబ్బందులు పడుతున్నారు
- ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి
- ప్రభుత్వం స్పందించకపోతే మళ్లీ ఉద్యమం
- గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత
- భూసేకరణ, ఇండ్ల కూల్చివేతలపై గవర్నర్‌కు వినతిపత్రం

2లో

## రూ.10వేలు తీసుకుంటూ పట్టుబడ్డ వడ్డేపల్లి సర్వేయర్

భూ సంబంధిత పనికి డబ్బులు డిమాండ్



2లో

వేద న్యూస్

బుధవారం | మే 27, 2026

## భగీరథ్‌కు మూడు రోజుల కస్టడీ

**వేద న్యూస్, హైదరాబాద్**

బండి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసులో మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఉత్తర్వులు వెలువరించింది. భగీరథ్‌ను వారం రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతివ్వాలని పోలీసులు కోర్టును కోరారు. అయితే ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం మూడు రోజుల కస్టడీకి మాత్రమే అనుమతించింది. ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. పోలీసు కస్టడీ పిటిషన్‌ను భగీరథ్ తరపు న్యాయవాది కరుణాసాగర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవేళ కస్టడీకి అనుమతిస్తే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య మాత్రమే విచారణ జరపాలని కోర్టును కోరారు. విచారణకు ముందు, తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించాలని కూడా విజ్ఞప్తి చేశారు. విచారణ సమయంలో బలవంతపు పద్ధతులు ఉపయోగించకుండా పోలీసులను ఆదేశించాలని భగీరథ్ తరపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. న్యాయపరమైన హక్కులను కాపాడాలని కోరుతూ పలు షరతులు విధించాలని విజ్ఞప్తి చేశారు. కోర్టు ఈ అంశాలపై కూడా సూచనలు చేసినట్లు సమాచారం. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోలీసులు కేసులో మరిన్ని కఠిన సెక్షన్లు జోడించారు. మే 16న హైకోర్టులో మధ్యంతర రక్షణ లభించకపోవడంతో భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే తన కుమారుడు పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయాడని బండి సంజయ్ పేర్కొన్నారు. నేరాన్ని అంగీకరించిన తర్వాతే అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కోర్టు భగీరథ్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## ఎబోలాపై సర్కార్ అలర్ట్!

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎలాంటి అనుమానాస్పద కేసులు లేవని అధికారులు మంత్రికి వివరించారు. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ వంటి ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. థర్మల్ స్కానింగ్‌తో పాటు ప్రత్యేక వైద్య బృందాలు ప్రయాణికులను పరిశీలిస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, పారామెడికల్ సిబ్బందితో ప్రత్యేక బృందాలు విధుల్లో ఉన్నాయని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల కోసం 108 అంబులెన్స్ సేవలను 24 గంటలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ప్రత్యేక ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశామని, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సునీల్ కుమార్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు వివరించారు. అనుమానితుల నమూనాలను పరీక్షల కోసం పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపనున్నట్లు తెలిపారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన లక్షణాలు లేని ప్రయాణికులను 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో ఉంచుతున్నామని అధికారులు తెలిపారు. జిల్లా నిఘా బృందాలు వీరిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 25 నాటికి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు వచ్చినప్పటికీ వారిలో ఎవరికీ వ్యాధి లక్షణాలు కనిపించలేదని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వారిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించాలని, ప్రభుత్వ ఆస్పత్రులన్నీ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విమానాశ్రయ అధికారులు, జిల్లా నిఘా బృందాలు, ఆస్పత్రుల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

## ఒకప్పుడు సిరుల మాగాణి..
## ఇప్పుడు స్కామ్‌ల గని

**మొదటి పేజీ తరువాయి**

తొలగించగా, కేసీఆర్ పాలనలో 19 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చి సింగరేణికి జీవం పోశామని పేర్కొన్నారు. ఉద్యోగాలు కల్పించడం బీఆర్ఎస్ పని అయితే, ఉద్యోగాల తొలగింపు కాంగ్రెస్ పని అని విమర్శించారు. సింగరేణికి రావాల్సిన బకాయిలు భారీగా పెరిగిపోయాయని హరీశ్ రావు తెలిపారు. 2014లో కేవలం రూ.2 వేల కోట్ల డ్యూస్ మాత్రమే ఉండగా, ఇప్పుడు అవి రూ.21 వేల కోట్లకు పెరిగాయని ఆరోపించారు. కరెంట్ బకాయిల రూపంలో మరో రూ.20 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఒకప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్న సింగరేణి ఇప్పుడు ఓవర్‌డ్రాఫ్ట్ పరిస్థితికి చేరిందని విమర్శించారు. సింగరేణి వెబ్‌సైట్‌లో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు చూపుతున్నారని, వాటి విలువ సుమారు రూ.1600 కోట్లు అవుతుందని తెలిపారు. ఆ బొగ్గు ఎక్కడ ఉందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై టీబీజీకేఎస్ ప్రశ్నించాలని సూచించారు. సోలార్ పవర్ ప్లాంట్లు, థర్మల్ ప్రాజెక్టుల విషయంలో కూడా భారీ అవినీతి జరుగుతోందని హరీశ్ రావు ఆరోపించారు. పీపీఏ, డీపీఆర్ ఆమోదం లేకుండానే పనులు ప్రారంభించారని, కమిషన్ల కోసం టెండర్లు ఇచ్చారని విమర్శించారు. సింగరేణి నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. బొగ్గు నిల్వలు, అవినీతి ఆరోపణలపై కేంద్రం నియమించిన కమిటీ నివేదికను ప్రజల ముందుంచాలని కోరారు. సింగరేణిని అప్పుల కుప్పగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## ఎయిర్ ఇండియా బస్సుకు మంటలు

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై మంగళవారం ఘోర ప్రమాదం తప్పింది. పెద్ద అంబర్‌పేట సమీపంలో ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన బస్సులో అకస్మాత్తుగా భారీగా మంటలు చెలరేగాయి. బస్సు వెనుక భాగం నుంచి దట్టమైన పొగలు రావడంతో ప్రయాణికులు అప్రమత్తమై వెంటనే డ్రైవర్‌కు సమాచారం అందించారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పినట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. ప్రయాణికులను వేగంగా కిందకు దింపే ప్రయత్నం చేశారు. ప్రయాణికులు దిగుతుండగానే మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. కొద్ది నిమిషాల్లోనే బస్సు పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. భారీగా ఎగసిపడుతున్న మంటలు, పొగలు చూసి అక్కడి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఔటర్ రింగ్ రోడ్డుపై మంటల్లో చిక్కుకున్న బస్సు కారణంగా ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనదారులు భయంతో తమ వాహనాలను నెమ్మదిగా ముందుకు తీసుకెళ్లారు. కొంతసేపు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

# ఖమ్మం కారులో
# నిస్తేజం!




## చేజారుతున్న కీలక నేతలు, కార్పొరేటర్లు

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాది ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన శైలి. అయితే, గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల వరకు తగిలిన వరుస ఎదురుదెబ్బలతో ప్రస్తుతం ఖమ్మం జిల్లా 'కారు'లో తీవ్ర నిస్తేజం ఆవరించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమి తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీలో నాయకత్వ వలసలు పెద్ద ఎత్తున చోటుచేసుకోవడం క్షేత్రస్థాయి క్యాడర్‌ను తీవ్ర అయోమయంలోకి నెట్టింది. ముఖ్యంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అత్యధిక మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కీలక నేతలు గులాబీ కండువా విడిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పార్టీకి పెద్ద షాక్ తగిలింది. ఇలాంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వంటి సీనియర్ నేతలు జిల్లాలోనే ఉంటూ పార్టీని బలోపేతం చేయడానికి, క్యాడర్‌లో ధైర్యం నింపడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ ద్వితీయ శ్రేణి నాయకత్వం, కార్యకర్తలు పొలిటికల్ ఫ్యూచర్ విషయంలో తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

### కాంగ్రెస్ ముగ్గురు మంత్రుల జోరు..

మరోవైపు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత పటిష్టంగా తయారైంది. జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు కీలక మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క తమదైన శైలిలో జిల్లాపై పూర్తి పట్టు సాధించి దూసుకుపోతున్నారు. ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల వేగం, రాజకీయ వ్యూహాలతో ఈ మంత్రుల త్రయం గులాబీ పార్టీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సైతం బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్ వైపు తిప్పుకోవడంలో ఈ ముగ్గురు మంత్రులు విజయవంతమయ్యారు. అధికార బలం, మంత్రుల హవా ముందు బీఆర్ఎస్ లీడర్లు నిలదొక్కుకోవడం క్షేత్రస్థాయిలో పెద్ద సవాల్‌గా మారింది.

### ఖమ్మంపై కేసీఆర్ స్పెషల్ ఫోకస్..

ఖమ్మం జిల్లాలో పార్టీ క్యాడర్ నీరసించిపోవడం, వలసలు పెరగడాన్ని గమనించిన గులాబీ బాస్ కేసీఆర్.. ఈ కోటను మళ్లీ బలోపేతం చేయడానికి రంగంలోకి దిగారు. ఉమ్మడి జిల్లాలో పార్టీకి పాత వైభవం తీసుకురావడమే లక్ష్యంగా 'ఆపరేషన్ ఖమ్మం'కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమ బాధ్యతలను ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుకు అప్పగించారు. కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా తక్కెళ్లపల్లి రవీందర్ రావు నియోజకవర్గాల వారీగా పర్యటిస్తూ నిస్తేజంలో ఉన్న క్యాడర్‌లో నూతనోత్తేజం నింపే ప్రయత్నం చేస్తున్నారు.

### కార్పొరేషన్ కైవసం సాధ్యమేనా?

ప్రస్తుత పరిస్థితుల్లో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌ను మళ్లీ కైవసం చేసుకోవడం బీఆర్ఎస్ పార్టీకి సాధ్యమేనా? అనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో తలెత్తుతోంది. అయితే, బీఆర్ఎస్ సీనియర్ నేతలు మాత్రం కార్పొరేషన్ పీఠంపై ధీమాగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం చెందడం, ముఖ్యంగా రైతుబంధు జాప్యం, రుణమాఫీ లొసుగులు, ధాన్యం కొనుగోళ్లలో రైతుల ఆక్రందనలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారుతున్నాయని గులాబీ లీడర్లు అంచనా వేస్తున్నారు. ఈ ప్రజా వ్యతిరేకతను, స్థానిక సమస్యలను అస్త్రాలుగా చేసుకుని ప్రజల్లోకి వెళ్తే.. మంత్రుల జోరును అడ్డుకుని ఖమ్మం కార్పొరేషన్‌పై మళ్లీ గులాబీ జెండా ఎగరేయడం అసాధ్యమేమీ కాదని కేసీఆర్ అండ్ టీమ్ భావిస్తోంది. తక్కెళ్లపల్లి నేతృత్వంలో సాగుతున్న ఈ డిజిటల్ సభ్యత్వ నమోదు, కేడర్ పునరుజ్జీవన చర్యలు 'కారు'కు ఏ మేరకు మైలేజ్ తెస్తాయో చూడాలి.

## రూ.30 లక్షల లంచం డిమాండ్..
## రూ.2 లక్షలు అడ్వాన్స్!

**వేద న్యూస్, హైదరాబాద్**

రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులు చేపట్టిన దాడుల్లో షమీర్‌పేట్ మండల తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ టి. సుచరిత రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వ్యవసాయ భూమికి నాలా కన్వర్షన్ చేయించేందుకు భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఏసీబీ వివరాల ప్రకారం.. 30 ఎకరాల వ్యవసాయ భూమికి నాలా కన్వర్షన్ ప్రక్రియ పూర్తి చేయడానికి తహసీల్దార్ సుచరిత రూ.30 లక్షల లంచం కోరినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తంలో భాగంగా రూ.2 లక్షలను ఆమె డ్రైవర్ వి. నాగేశ్ ద్వారా స్వీకరిస్తున్న సమయంలో మంగళవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడి సమాచారంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని ఈ దాడి నిర్వహించారు. డ్రైవర్ ద్వారా డబ్బు స్వీకరిస్తున్న సమయంలో అధికారులు రంగంలోకి దిగి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. ఈ ఘటనతో రెవెన్యూ శాఖలో మరోసారి అవినీతి వ్యవహారాలు వెలుగులోకి



వచ్చాయి. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత ఉండాలని అధికారులు చెబుతున్నప్పటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం, సంబంధిత వ్యక్తుల నివాసాల్లో కూడా సోదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన ఆధారాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

## రూ.10వేలు తీసుకుంటూ పట్టుబడ్డ సర్వేయర్

**వేద న్యూస్, గద్వాల**

జోగులాంబ గద్వాల జిల్లాలో వడ్డేపల్లి మండల సర్వేయర్ కమ్మరి బ్రహ్మయ్య ఏసీబీ అధికారులకు చిక్కాడు. భూ సంబంధిత పనిని పూర్తి చేయడానికి లంచం డిమాండ్ చేసి, నగదు స్వీకరిస్తున్న సమయంలో అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుని నుంచి రూ.15 వేల లంచం కోరిన సర్వేయర్ బ్రహ్మయ్య, అందులో భాగంగా రూ.10 వేల నగదును స్వీకరిస్తుండగా మహబూబ్‌నగర్ ఏసీబీ బృందం మంగళవారం దాడి నిర్వహించింది. ఫిర్యాదు ఆధారంగా ముందస్తు ప్రణాళికతో ఉచ్చుపన్ని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నగదు స్వీకరించిన అనంతరం నిర్వహించిన రసాయన పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లు వెల్లడించారు. ఈ ఘటనతో ప్రభుత్వ శాఖల్లో కొనసాగుతున్న అవినీతి వ్యవహారాలు మరోసారి వెలుగులోకి వచ్చాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ప్రజల పనులు పూర్తిచేయడానికి లంచాలు డిమాండ్ చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. నిందితుడిపై అవినీతి నిరోధక చట్టాల కింద కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## భూ బాధితులకు న్యాయం చేయాలి

### గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం లోక్ భవన్‌లో కలిసి భూ నిర్వాసితుల సమస్యలను వివరించారు. ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్‌తో పాటు వెలుగుమట్ల, ట్రిపుల్ ఆర్, పరిగి ప్రాంతాల బాధితులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. భూసేకరణ, ఇండ్ల కూల్చివేత, రహదారి అలైన్‌మెంట్ మార్పుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతలు, ట్రిపుల్ ఆర్ రహదారి అలైన్‌మెంట్ మార్పులు, రాయగిరి భూసేకరణ, పరిగి మండలం కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణ అంశాలపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు కవిత తెలిపారు. ఈ అంశాలపై ప్రభుత్వం నుంచి నివేదిక తెప్పించుకుని చర్యలు తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఇళ్లు కూల్చి మానసికంగా వేధిస్తోందని ఆరోపించారు. మహిళలకు వంద రూపాయల చీరలు ఇచ్చి కోటీశ్వరులను చేశామంటూ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతల సమయంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఒక మహిళకు



గర్భస్రావం జరిగిన ఘటన ఇప్పటికీ మర్చిపోలేమని అన్నారు. రైతుల ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆవేదనలో ఉన్నారని పేర్కొంటూ వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ రహదారి అలైన్‌మెంట్‌ను నాలుగు సార్లు మార్చిన విషయాన్ని కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కేంద్ర మంత్రికి సంబంధించిన లేఖలను గవర్నర్‌కు చూపించినట్లు చెప్పారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే మళ్లీ ఉద్యమ బాట పడతామని కవిత హెచ్చరించారు.

## సెప్టిక్ ట్యాంకులో ఆరుగురు మృతి

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

ఒడిశా రాష్ట్రంలోని కలహండి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంకులో ఊపిరాడక ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మంగళవారం చోటుచేసుకుంది. విషవాయువులు వ్యాపించిన ట్యాంకులో ఒకరి తర్వాత ఒకరు దిగడంతో ఈ దుర్ఘటన జరిగింది. మరో కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కలహండి జిల్లా మదన్‌పూర్-రాంపూర్ బ్లాక్ పరిధిలోని గౌడ కర్లాంకుంట గ్రామంలో ఓ ఇంటికి కొత్తగా సెప్టిక్ ట్యాంకు నిర్మిస్తున్నారు. సెంట్రింగ్ సామగ్రిని బయటకు తీసేందుకు ఓ మేస్త్రీ ట్యాంకులోకి దిగగా విషవాయువులను పీల్చి స్పృహ తప్పి పడిపోయాడు. అతడిని కాపాడేందుకు మరో ఇద్దరు మేస్త్రీలు, ఇద్దరు కూలీలు ట్యాంకులోకి దిగారు. పరిస్థితి తెలియక ఇంటి యజమాని నిమైపాల్, అతని కుమారుడు ఆకాశ్ పాల్ కూడా లోపలికి వెళ్లారు. అయితే విషవాయువుల ప్రభావంతో వారందరూ స్పృహ కోల్పోయి ట్యాంకులోనే పడిపోయారు. స్థానికులు వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆరుగురు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుల్లో ముగ్గురు మేస్త్రీలు, ఒక కూలీ, ఇంటి యజమాని, అతని కుమారుడు ఉన్నారు. మరో కార్మికుడు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి రూ.4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు. సెప్టిక్ ట్యాంకులు, బోర్లు, మూసివేసిన ప్రదేశాల్లోకి దిగేటప్పుడు భద్రతా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భూములు తీసుకుంటే..
## మా బతుకులు రోడ్డున పడతాయ్

**వేద న్యూస్, వికారాబాద్**

వికారాబాద్ జిల్లా దోమ మండలంలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం చేపట్టనున్న భూసేకరణపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సదస్సు ఉద్రిక్త వాతావరణంలో సాగింది. దిరసంపల్లి అనుబంధ గ్రామం అనంతరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను ప్రభుత్వానికి ఇవ్వలేమంటూ పలువురు రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ఐదు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు మొత్తం 305 ఎకరాల భూమిని సేకరించేందుకు సిద్ధమైంది. ఇందులో 209 ఎకరాల పట్టా భూమి, 96 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూసేకరణతో 133 మంది పట్టా రైతులు, 37 మంది అసైన్డ్ భూమి రైతులు ప్రభావితమవుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో రైతులు భావోద్వేగానికి గురయ్యారు. మా పిల్లలకు ఇచ్చేది ఈ భూములే.. అవి కూడా తీసుకుంటే ఎలా బతకాలి అంటూ అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటిస్తున్న పరిహారం రేట్లు సరిపోవని, భూమే తమ జీవనాధారమని స్పష్టం చేశారు. ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏ పరిశ్రమలు రానున్నాయో స్పష్టత లేదని రైతులు ఆరోపించారు. పరిశ్రమల వల్ల కాలుష్యం పెరిగి వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయని, అక్కడే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల ఆందోళనల మధ్య అధికారులు భూసేకరణ ప్రక్రియపై వివరాలు వెల్లడిస్తూ, ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

వేద న్యూస్

బుధవారం మే 27 , 2026

# జగిత్యాలను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- కేంద్రీయ విద్యాలయానికి నర్సింగాపూర్‌లో 6 ఎకరాల స్థలం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- స్థలాన్ని పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**వేద న్యూస్, జగిత్యాల రూరల్:**

అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయం కోసం నర్సింగాపూర్ శివారులో 6 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు వెల్లడించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నర్సింగాపూర్ ప్రాంతాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే ఐటీఐ, ఈఏటీసీ కేంద్రాలు ఏర్పాటు చేశామని, కేంద్రీయ విద్యాలయం కూడా రావడంతో విద్యార్థులకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. భూములకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరలో కేంద్ర అధికారులకు పంపుతామని చెప్పారు. జగిత్యాల విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ధర్మపురి అరవింద్ కేంద్ర ప్రభుత్వం నుంచి సహకరించాలని మంత్రి కోరారు.

# సీనియర్ సిటిజన్స్ సేవలు వినియోగించుకోవాలి

- డాక్టర్ అనితా రెడ్డి



**వేద న్యూస్, హనుమకొండ:**

డాక్టర్ అనితా రెడ్డి హనుమకొండ జిల్లా పరిషత్ ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడ వృద్ధుల కోసం అందిస్తున్న ఫిజియోథెరపీ క్లినిక్, లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసు అథారిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు అందిస్తున్న న్యాయ సలహాలు, కౌన్సిలింగ్ సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారా లీగల్ వాలంటీర్ ద్వారా నమోదైన కేసులు, సలహాల కోసం వచ్చిన వారి సంఖ్యపై సమీక్ష నిర్వహించారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ, న్యాయ సలహా సేవలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు వృద్ధులకు ఒక వరమని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం మరింతగా పనిచేయాలని, సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వేసవిలో వృద్ధులకు అందిస్తున్న రాగి జావను కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉష, పారా లీగల్ వాలంటీర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ప్రారంభం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ పట్టణంలోని సినారె కళామందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతు విజ్ఞాన కేంద్రం ద్వారా ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు చేరువవుతాయని తెలిపారు. శాస్త్రవేత్తల పరిశోధనలు నేరుగా రైతులకు ఉపయోగపడేలా ఈ కేంద్రం పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అల్డస్ జానయ్య మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలన సమావేశం

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్యక్రమం



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలం కోనేరుపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై సమీక్ష సమావేశాన్ని గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాలను గ్రామ ప్రజలకు వివరించారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, అలాంటి వివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కనకట్ల నరేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి త్రిదండపాణి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ శౌరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఖబడ్దార్ కొప్పుల ఈశ్వర్

- నోరుందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దు
- మంత్రి అడ్లూరి హెచ్చరిక
- పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి




**వేద న్యూస్, ధర్మారం:**

అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.'నోరు ఉందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయి. ప్రజల కోసం పనిచేస్తున్న నాపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదు' అని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందన్నారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ధరలు తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించిన మంత్రి, మాజీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ కూడా నిర్మించలేదని విమర్శించారు. ధర్మారం మండలంలోని మిగులు ప్రభుత్వ భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని మంత్రి ప్రకటించారు. బొమ్మరెడ్డిపల్లిలో 79 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. త్వరలో నర్సింగాపూర్‌లోని ప్రభుత్వ భూములను కూడా తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని స్పష్టం చేశారు. నేను నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నాను. వ్యక్తిగత విమర్శలు చేసే ముందు కొప్పుల ఈశ్వర్ పద్ధతి మార్చుకోవాలి అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- సస్పెన్షన్ వేటు బాధాకరం
- కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, దావ వసంత సురేష్



**వేద న్యూస్, జగిత్యాల టౌన్:**

సస్పెన్షన్‌కు గురైన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను ఎలాంటి నిబంధనలు లేకుండా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జిల్లా తొలి జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగిత్యాలలో కాంగ్రెస్ నాయకులు పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ధర్నా నిర్వహిస్తున్న సమయంలో ముందు వడ్లు కొనుగోలు చేయాలి అని మాట్లాడినందుకు డ్రైవర్ అశోక్‌పై సస్పెన్షన్ వేటు వేయడం అత్యంత బాధాకరమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అంతమాత్రానికే ఉద్యోగం నుంచి తొలగించడం కక్షసాధింపు చర్యేనని మండిపడ్డారు. బాధిత డ్రైవర్ అశోక్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. యాజమాన్యం స్పందించి అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్మికులు, ప్రజలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ అశోక్‌పై వేటు సరికాదు

- ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే చర్యలు
- జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇంచార్జీ డాక్టర్ శ్రావణి
- ఫోన్లో మాట్లాడి ధైర్యం చెప్పిన ఎంపీ ధర్మపురి అరవింద్



**వేద న్యూస్, జగిత్యాల కేంద్రం:**

జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను పరామర్శించి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే అశోక్‌పై వేటు వేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆమె మండిపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, అలా ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. డ్రైవర్ అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఫోన్ ద్వారా అశోక్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ తరపున, వ్యక్తిగతంగా అశోక్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అశోక్ ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, సుంచు సురేష్, శ్రీపతి రమేష్, పవన్ సింగ్, ఇట్యాల రాము, సిరిపురం శ్రీనివాస్, గట్టుపల్లి జ్ఞానేశ్వర్, కాసేట్టి తిరుపతి, శివ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం మే 27 , 2026

# ఏసీబీకి చిక్కిన వడ్డేపల్లి సర్వేయర్

- భూమి సర్వే కోసం రైతు నుంచి రూ.20 వేల డిమాండ్
- రూ.10 వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

**వేద న్యూస్, గద్వాల్ ప్రతినిధి:**



జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య భూమి సర్వే కోసం రైతు నుంచి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. రైతు ఫిర్యాదు మేరకు మహబూబ్‌నగర్ ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడి నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మండలానికి చెందిన ఓ రైతు నాలుగు ఎకరాల భూమిని సర్వే చేయించుకోవడానికి సర్వేయర్ బ్రహ్మయ్యను సంప్రదించగా, ఎకరాకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.20 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. ముందుగా రూ.5 వేల అడ్వాన్స్‌గా తీసుకున్న బ్రహ్మయ్య, మిగిలిన మొత్తం చెల్లిస్తేనే సర్వే చేస్తానని ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. దీంతో బాధిత రైతు మహబూబ్‌నగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఫిర్యాదు ఆధారంగా డీఎస్పీ బాలకృష్ణ సారథ్యంలో ఏసీబీ బృందం వడ్డేపల్లిలో నిఘా ఏర్పాటు చేసింది. రైతు నుంచి రూ.10 వేల లంచం తీసుకుంటుండగా అధికారులు దాడి చేసి సర్వేయర్‌ను పట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన రసాయన పరీక్షల్లో లంచం స్వీకరించినట్లు నిర్ధారణ అయిందని అధికారులు తెలిపారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మహేందర్

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మంత్రి మహేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడిపల్లి సత్యం నాయకత్వంలో చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. గంగాధర మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తనను మండల అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధిష్టానానికి, సహకరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు మంత్రి మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

- వందరోజుల కూలీలకు కంటి పరీక్షలు నిర్వహణ



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో చెరువు కట్ట వద్ద పనిచేస్తున్న వందరోజుల కూలీల కోసం మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ మచ్కూరి రమేష్ సహకారంతో ఈ శిబిరం చేపట్టారు. ఈ శిబిరంలో మొత్తం 116 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి చుక్కల మందులు పంపిణీ చేశారు. చికిత్స అవసరమైన 12 మంది రోగులను కంటి ఆపరేషన్ కోసం బోధన్‌లోని లయన్స్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ అధ్యక్షులు కెవి. మోహన్ మాట్లాడుతూ.. ఎండలో కష్టపడి పనిచేస్తున్న కూలీలకు వైద్య సేవలు అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన సభ్యులు, గ్రామ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ శ్యాంసుందర్ పహాడే, సభ్యులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రేతలకు 7 ఏళ్ల శిక్ష

- రూ.10 వేల జరిమానా విధించిన కోర్టు

**వేద న్యూస్, కొడిమ్యాల:**

జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడిన ఇద్దరు నిందితులకు 1వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ న్యాయస్థానం 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా కూడా విధిస్తూ గౌరవ న్యాయమూర్తి జి. సునీత రవీంద్ర రెడ్డి తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన ఏ-1 కుల్దీప్ రవి కుమార్ (20), ఏ-2 పాంగి లైకన్‌లు 2021 ఫిబ్రవరి 18న కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని పూడూరు గ్రామ శివారులో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. అప్పటి ఎస్సై శివకృష్ణ వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను తనిఖీ చేయగా, అందులో 8 ప్యాకెట్లలో మొత్తం 16 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితులు పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, అప్పటి సీఐ కిషోర్ దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితులపై నేరం రుజువైందని తేల్చింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. గంజాయి పెంపకం, రవాణా, అమ్మకాలకు పాల్పడితే ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ముందు వడ్లు కొనండి అన్నందుకు ఆర్టీసీ డ్రైవర్‌పై వేటు!

- జగిత్యాల డిపో పరిధిలో వివాదాస్పద నిర్ణయం
- డ్రైవర్ వ్యాఖ్యల వీడియో వైరల్

**వేద న్యూస్, జగిత్యాల:**



రైతులు పండించిన ధాన్యాన్ని ముందుగా కొనుగోలు చేయాలని సూచించినందుకు ఓ ప్రైవేట్ హైరింగ్ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై వేటు పడిన ఘటన జగిత్యాల జిల్లాలో రాజకీయ దుమారం రేపుతోంది. మే 25న జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెట్రోల్, డీజిల్ ధరల పెంపుకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. అదే సమయంలో జగిత్యాల నుంచి ధర్మపురి వెళ్తున్న ప్రైవేట్ హైరింగ్ ఆర్టీసీ బస్సు (TS21T-5006) అక్కడ నిలిచిపోయింది. ఈ సందర్భంగా డ్రైవర్ బి. అశోక్ (బ్యాడ్జ్ నెం: 41/03) మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ ధరల కంటే ముందుగా రైతులు పండించిన వడ్లు, మక్కలు కొనుగోలు చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. డ్రైవర్ వ్యాఖ్యలపై ధర్మపురి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సి. లక్ష్మణ్ జగిత్యాల డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. పార్టీ నాయకులను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జగిత్యాల డిపో మేనేజర్, సంబంధిత బస్సు యజమాని చుక్క వేణుగోపాల్ కు నోటీసులు జారీ చేశారు. కాంగ్రెస్ నాయకులను విమర్శించినందుకు డ్రైవర్ బి. అశోక్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం.

# రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించిన పోలీసులు
- డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని ఏసీపీ సూచన

**వేద న్యూస్, శాయంపేట:**



రాత్రి వేళల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు శాయంపేట పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరకాల ఏసీపీ సతీష్ బాబు ఆధ్వర్యంలో శాయంపేట మండలం పెద్దకోడపాక గ్రామంలో దాదాపు 50 ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఏసీపీ సతీష్ బాబు మాట్లాడుతూ.. రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ట్రాక్టర్లు, వ్యవసాయ వాహనాలు రాత్రివేళల్లో స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఉపయోగపడతాయని తెలిపారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై పరమేశ్వర్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యమైన పత్తి విత్తనాలనే విక్రయించాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- వ్యవసాయ అధికారి మార్క ప్రియదర్శిని




**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల రైతు వేదికలో ఖరీఫ్ సీజన్ సన్నాహకాలపై మండల వ్యవసాయ అధికారి మార్క ప్రియదర్శిని ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీలర్లు హెచ్.టి. పత్తి విత్తనాల విక్రయాన్ని పూర్తిగా నివారించాలని, ప్రభుత్వం అనుమతించిన నాణ్యమైన పత్తి విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించరాదని స్పష్టం చేశారు. డీలర్లు తమ వద్ద రిజిస్టర్లు, బిల్ బుక్స్ సక్రమంగా నిర్వహించడంతో పాటు లైసెన్సులను స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలని, స్టాక్ బోర్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. విత్తనాలకు సంబంధించిన సోర్స్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. యూరియా విక్రయాలను పూర్తిగా ఫర్టిలైజర్ యాప్ ద్వారా మాత్రమే నిర్వహించాలని, గడువు ముగిసిన లేదా నాణ్యతలేని పురుగుమందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి హెచ్చరించారు.

# శాంతియుత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

**వేద న్యూస్, శాయంపేట:**

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా శాయంపేట పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు, పోలీసు అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆచారాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ సమాజంపై బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అన్ని మతాల ప్రజలు సహనం, సంయమనంతో కలిసి మెలిసి బక్రీద్ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జక్కుల పరమేష్, పోలీసు సిబ్బంది మరియు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.




- సీఐ సుధాకర్ రెడ్డి

# పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ గడువు 31 వరకు పొడిగింపు

**వేద న్యూస్, జగిత్యాల:**

జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వెల్లడించారు. అర్హులైన విద్యార్థులందరూ అధికారిక ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు సంబంధించిన కళాశాల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే జిల్లా కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా ఫార్వార్డ్ చేయాలని కళాశాల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ లేని విద్యార్థులను గుర్తించి, తక్షణమే ఆధార్ సీడింగ్ పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా దరఖాస్తు చేసుకోని విద్యార్థులకు సమాచారం అందించి, గడువు ముగిసేలోగా దరఖాస్తులు పూర్తయ్యేలా చూడాలని కళాశాల యాజమాన్యాలకు సూచించారు.

# మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్



**వేద న్యూస్, దేవరకద్ర:**

వనపర్తి జిల్లాలో ఉపాధి హామీ పనుల సమయంలో ముగ్గురు కూలీలు మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు యస్. అజయ్ డిమాండ్ చేశారు. కొత్తకోట మండలం పాలెంకు చెందిన గుండె శాంతమ్మ, మదనాపూర్ మండలం అజ్జకొల్లుకు చెందిన కావలి గోవిందమ్మ ఉపాధి పనుల సమయంలో మృతి చెందగా, సోమవారం వనపర్తి మండలం అచ్చుతాపురంకు చెందిన కురుమయ్య చింతల చెరువులో పనులు చేస్తూ కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అదేవిధంగా ఆత్మకూరు మండలం బాలకిష్టాపూర్‌కు చెందిన సైదా బేగం ఉపాధి పనుల సమయంలో కాలికి గడ్డపారా గుచ్చుకుని తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. మృతి చెందిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన సైదా బేగంకు ప్రైవేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో తాగునీటి వసతి, టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు అందుబాటులో ఉంచాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేస్తే కఠిన చర్యలు

- బాల్య వివాహం చేస్తే 1098కు సమాచారం ఇవ్వాలి
- జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి సూచన



**వేద న్యూస్, మానకొండూరు:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని మానకొండూరు మండలం అన్నారం గ్రామపంచాయతీలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత తెలంగాణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ.. బాల్య వివాహం - బతుకు ఆగం అనే నినాదంతో సమాజంలో మార్పు రావాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకముందే వివాహం చేయడం నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, నిర్వహించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల పిల్లల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్నారం గ్రామంలో బాల్య వివాహాల నిరోధం, నిర్మూలనకు సంబంధించిన ప్రత్యేక తీర్మానాన్ని గ్రామపంచాయతీ ఆమోదించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, సీడీపీఓ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కోఆర్డినేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సఖి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్టుల పునరుద్ధరణకు జీవో విడుదల

- రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు

**వేద న్యూస్, దేవరకద్ర:**

దేవరకద్ర నియోజకవర్గంలోని సరళ సాగర్, కురుమూర్తి రాయ, నెల్విడి లిఫ్టుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసినట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తెలిపారు. సరళ సాగర్ లిఫ్ట్‌కు రూ.1.94 కోట్లు, కురుమూర్తి రాయ లిఫ్ట్‌కు రూ.1.45 కోట్లు, నెల్విడి లిఫ్ట్‌కు రూ.92 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లిఫ్టుల మరమ్మతులు త్వరలో ప్రారంభించి వచ్చే వర్షాకాలానికే రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్



శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# హెచ్‌టీ సర్వీసులకు సింగిల్ విండో విధానం

- వేగవంతంగా విద్యుత్ సేవల మంజూరు
- ప్రత్యేక హెచ్‌టీ మానిటరింగ్ సెల్ ఏర్పాటు
- స్పష్టం చేసిన ఎస్ఈ సుదర్శనం



**వేద న్యూస్, జగిత్యాల:**

హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీ మరియు ఆపై వోల్టేజ్ విద్యుత్ సర్వీసుల మంజూరును వేగవంతం చేసేందుకు 'సింగిల్ విండో' విధానం అమలు చేస్తున్నట్లు జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. సుదర్శనం తెలిపారు. దరఖాస్తుల పర్యవేక్షణ కోసం కార్పొరేట్, సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా 'హెచ్‌టీ మానిటరింగ్ సెల్' ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 11 కేవీ దరఖాస్తులను సర్కిల్ కార్యాలయం ఏడీఈ (కమర్షియల్), 33 కేవీ మరియు అంతకంటే పై వోల్టేజ్ దరఖాస్తులను కార్పొరేట్ కార్యాలయం ఏడీఈ పర్యవేక్షిస్తారని తెలిపారు. టీజీ ఐపాస్ పరిధిలో లేని దరఖాస్తుదారులు టీజీఎన్పీడీసీఎల్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు ప్రత్యేక యూఐడీ నంబర్ కేటాయించి, ప్రతిరోజూ డాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. 11 కేవీ దరఖాస్తులను పరిశీలించి సాధ్యమైన పక్షంలో రెండు రోజుల్లో అనుమతులు జారీ చేస్తామని, సాధ్యం కాకపోతే కారణాలను ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తామని ఎస్ఈ బి. సుదర్శనం వివరించారు.

# రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు



**వేద న్యూస్, పాపన్నపేట:**

పాపన్నపేట మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను మంగళవారం సర్పంచ్ పావని, నరేందర్ గౌడ్ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. రూ.10 లక్షల నిధులతో బ్రహ్మణకుంట సమీపంలోని పాతూరు ముత్యాల పోచమ్మ ఆలయం నుంచి నాగులమ్మ గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. బుధవారం సంత సందర్భంగా ఈ రహదారిపై వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో రోడ్డు నిర్మాణం ప్రజలకు ఉపయోగకరంగా మారనుంది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నయీమ్, వార్డు సభ్యులు రాములు, కిష్టయ్య, సత్యగౌడ్, ఖలీమ్, శివయ్య, ప్రసాద్, శ్రీను, చోటు, వినేష్ గౌడ్, శ్రీశైలం, వెంకన్న, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి లక్ష విరాళం

- భక్తుల వినతిపై స్పందించిన బీజేపీ నాయకులు



**వేద న్యూస్, దేవరకద్ర:**

అమరచింతలో నిర్మాణంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ పనుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తుల వినతి మేరకు ప్రస్తుతం మధ్యంతరంగా నిలిచిపోయిన ఆలయ నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు తన వంతు సహాయంగా ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నరాల నారాయణ, అధ్యక్షురాలు లావణ్య, మాజీ ఉపసర్పంచ్ పోతు నారాయణ, తిరుమలి రఘు, వాసవి నరసింహులు గౌడ్, కౌన్సిలర్లు, మండల నాయకులు, బీజేవైఎం నాయకులు మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్గటూర్‌లో గోదాం రోడ్డు మరమ్మతులు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాలతో పనులు



**వేద న్యూస్, వెల్గటూర్:**

వెల్గటూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలోకి లారీల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మంగళవారం రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి రోడ్డును చదును చేయించారు. అదేవిధంగా వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న రహదారి ఇరువైపుల చెట్ల కొమ్మలను తొలగించారు. గోదాంకు వచ్చే లారీలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనపట్ల దినేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోల తిరుపతి, ధర్మపురి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొత్త నరసింహులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజుకు చేరిన ఐకేపీ వీవోఏల సమ్మె

**వేద న్యూస్, కోటగిరి:**



కోటగిరి మండల కేంద్రంలో ఐకేపీ వివోఏల నిరవధిక సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. వీవోఏలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే 58 జీవో సవరణతో పాటు రూ.20 లక్షల వరకు ఆరోగ్య, సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షురాలు శోభ, కార్యదర్శి రాజు, కోశాధికారి రమేష్, సహాయ కార్యదర్శి శిరీషతో పాటు వివిధ గ్రామాల ఐకేపీ గ్రామ సంఘం సహాయకులు పాల్గొన్నారు.

# యువతకు క్రికెట్ కిట్ల పంపిణీ

- కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**వేద న్యూస్, కోటగిరి:**



కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటగిరి మండలం దేవునిగుట్ట తండా గ్రామంలో యువతకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏముల నవీన్ మాట్లాడుతూ.. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెరగడానికి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సీతారాం నాయక్, ఏముల నవీన్, పత్తి సతీష్, కప్ప సాయిలు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో భారీ కార్డెన్ సెర్చ్

- 360 ఇండ్ల తనిఖీ.. 46 మంది అనుమానితుల గుర్తింపు
- 54 వాహనాలు, 16 గుట్కా బ్యాగుల స్వాధీనం
- నేరాల నియంత్రణకు ప్రత్యేక ఆపరేషన్
- ఎస్పీ శరత్ చంద్ర పవార్



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

నల్లగొండ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు పట్టణంలో తెల్లవారుజామున విస్తృత స్థాయిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సతీష్ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో 10 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో ఏడుగురు సీఐలు, 18 మంది ఎస్ఐలు, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో పాటు సుమారు 200 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు 360 ఇండ్లను తనిఖీ చేసి 46 మంది అనుమానితులను గుర్తించి విచారణ చేపట్టారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మందిని కూడా గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరు రౌడీషీటర్లు, ఐదుగురు ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టారు. అక్రమంగా నిల్వ ఉంచిన 16 గుట్కా బ్యాగులు, పత్రాలు లేని 54 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. గంజా పరీక్షల్లో ఇద్దరు గంజా సేవించినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

# నీరు వృథాగా పోతున్నా పట్టించుకోరా?!

**వేద న్యూస్, మడికొండ:**





హన్మకొండ జిల్లా కాజీపేట పట్టణంలోని మడికొండ గ్రామంలో మంచినీటి పైపులైన్లు పగిలిపోవడంతో లీటర్ల కొద్దీ నీరు రోడ్డుపై వృథాగా పోతుంది. పలుచోట్ల లీకేజీలు ఏర్పడినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 64వ డివిజన్ నెహ్రూనగర్ మెయిన్ రోడ్డులో గణేష్ కిరాణం వద్ద, ఖండాల దాబా పక్కన సుచి హోటల్ ఎదురుగా పలుమార్లు మరమ్మతులు చేసినా సమస్య మళ్లీ మళ్లీ తలెత్తుతోందని తెలిపారు. ప్రజాధనం ఖర్చువుతున్నా ప్రజలకు మాత్రం సరైన మంచినీటి సరఫరా అందడం లేదని విమర్శిస్తున్నారు. ఒకవైపు ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు నీరు వృథాగా పోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. 5 నుంచి 10 రోజులకు ఒకసారి కూడా సరైన నీటి సరఫరా లేక ప్రజలు మినరల్ వాటర్ క్యాన్లు కొనుగోలు చేసి వాడుతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలను శాశ్వతంగా పరిష్కరించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కురుమ సంఘ భవనానికి రూ.5 లక్షలు మంజూరు

- ప్రొసీడింగ్ పత్రం అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**వేద న్యూస్, చొప్పదండి:**



పట్టణ కురుమ సంఘ భవనం మరమ్మతుల కోసం రూ.5 లక్షల నిధులను మంజూరు చేసి ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేసిన చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యంకు కురుమ సంఘ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు గోస్కుల కొమురెల్లి మాట్లాడుతూ.. కుల సంఘాల అభివృద్ధికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సరిత శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ పెరమండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కురుమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిజనపురం చందును నియమించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పట్ల నిబద్ధత, క్రమశిక్షణతో కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపిస్తున్న ఇప్ప శ్రీనివాస్ రెడ్డికి అధిష్టానం మరోసారి అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యంకు, పార్టీ అధిష్టానానికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పేరుమాండ్ల మానస గంగయ్య గౌడ్ శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తునిలో ఫ్రీ సమ్మర్ వాలీబాల్ క్యాంప్

- ముఖ్య అతిథిగా పాల్గొన్న దుర్గాప్రసాద్
- క్రీడలతో మంచి భవిష్యత్ సాధ్యమని సూచన



**వేద న్యూస్, తుని:**

కాకినాడ జిల్లా తుని రాజా గ్రౌండ్‌లో ఫ్రెండ్స్ వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో, డీఎస్‌డీవో సహకారంతో నిర్వహిస్తున్న ఫ్రీ సమ్మర్ వాలీబాల్ క్యాంప్‌కు యువత భారీగా హాజరవుతున్నారు. పాల్గొంటున్న క్రీడాకారులకు నిర్వాహకులు పోషకాహారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు పెంకే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. వాలీబాల్ క్రీడ ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. తునికి వాలీబాల్ క్రీడలో మంచి గుర్తింపు ఉందని, ఇక్కడి క్రీడాకారులు అనేక రంగాల్లో స్థిరపడినట్లు పేర్కొన్నారు. తుని నియోజకవర్గంలోని వాలీబాల్ క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ క్యాంప్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బర్రె నాగరాజు పర్యవేక్షణలో జరుగుతుండగా, స్టేట్ రిఫరీ పి. రమణ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

# మహిళా భద్రతపై అవగాహన

- గోడ పత్రికను ఆవిష్కరించిన సీపీ సన్ ప్రీత్ సింగ్
- మహిళల రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యం
- సీపీ కార్యాలయంలో కార్యక్రమం



**వేద న్యూస్ వరంగల్ :**

మహిళల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూపొందించిన గోడ పత్రికను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం ఆవిష్కరించారు. సీపీ కార్యాలయంలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని సీపీ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాల నివారణకు అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని సీపీ అభిప్రాయపడ్డారు. మహిళలకు చట్టపరమైన హక్కులు, రక్షణ చర్యలపై విస్తృతంగా చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గోడ పత్రిక ద్వారా మహిళలకు ఉపయోగకరమైన సమాచారం చేరుతుందని పేర్కొన్నారు. పోలీసు శాఖ మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాలు, హెల్ప్‌లైన్ సేవలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. మహిళలు, బాలికలు నిర్భయంగా జీవించే వాతావరణం కల్పించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ దార కవిత, అదనపు డీసీపీ రవి, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మహిళల రక్షణకు సంబంధించిన కార్యక్రమాలను మరింత విస్తరించాలని అధికారులు నిర్ణయించారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

- కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- జాప్యం చేస్తే కఠిన చర్యల హెచ్చరిక



**వేద న్యూస్ సూర్యాపేట :**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చివ్వెంల మండలం బీబీ గూడెంలోని శివ దుర్గ రైస్ మిల్, తిరుమలగిరి మండలంలోని ఇటూరు గ్రామంలో సోమేశ్వర రైస్ మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారా రైస్ మిల్, తాటిపాముల పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. మిల్లులకు చేరుతున్న ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం దిగుమతిలో ఎలాంటి జాప్యం జరగకుండా మిల్లర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సదుపాయాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా లారీలు, ఇతర వాహనాల ద్వారా వేగంగా తరలించాలని సూచించారు. రైతులను తరుగు పేరుతో ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత ఉండాలని, రైతులకు న్యాయం జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాల పేరుతో అనవసర ఇబ్బందులు కలిగించవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు, గన్ని సంచుల లభ్యత, రవాణా పరిస్థితులు, అన్‌లోడింగ్ ప్రక్రియపై కలెక్టర్ ఆరా తీశారు. రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో డీఎస్ఓ మోహన్ బాబు, డీఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, చివ్వెంల తహసీల్దార్ చంద్రశేఖర్, తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్, రైస్ మిల్లర్ల యజమానులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# అమెజాన్ 'మెగా క్రికెట్ ఫెస్టివల్'..




**వేద న్యూస్ డెస్క్:**

క్రికెట్ అభిమానులు, స్పోర్ట్స్ లవర్స్ కోసం అమెజాన్ ఇండియా ప్రత్యేక 'మెగా క్రికెట్ ఫెస్టివల్'ను ప్రారంభించింది. మే 31, 2026 వరకు కొనసాగనున్న ఈ ప్రత్యేక సేల్‌లో క్రీడా పరికరాలు, అభిమానుల కోసం ప్రత్యేక మర్చండైజ్, ఫిట్‌నెస్ ఉత్పత్తులు, కలెక్టిబుల్స్, స్మార్ట్ టీవీలపై 70 శాతం వరకు భారీ తగ్గింపులు అందుబాటులో ఉంచింది. ఈ ఫెస్టివల్‌లో ప్రముఖ బ్రాండ్లకు చెందిన ఉత్పత్తులు ఆకర్షణీయ ధరల్లో లభిస్తున్నాయి. ముఖ్యంగా ఎస్‌జీ, డీఎస్‌సీ, కోకాటూ, బోల్డ్ ఫిట్, నివియా, ప్లేయర్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ కనిపిస్తోంది. ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై అదనపు రాయితీలు కూడా అందిస్తున్నారు. అలాగే ఐసీఐసీఐ బ్యాంక్తో భాగస్వామ్యంలో ఉన్న అమెజాన్ పే క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ సదుపాయం కల్పిస్తున్నారు. ప్రైమ్ సభ్యులకు కొన్ని ఎంపిక చేసిన ఉత్పత్తులపై అదే రోజు డెలివరీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఈసారి కొనుగోలు అనుభవాన్ని మరింత సులభతరం చేసేందుకు అమెజాన్ కృత్రిమ మేధ ఆధారిత సరికొత్త ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'రూఫస్' అనే ఏఐ అసిస్టెంట్ ద్వారా హింగ్లిష్‌తో పాటు భారతీయ భాషల్లో కూడా వినియోగదారులు తమ అవసరాలకు తగ్గ ఉత్పత్తులను సులభంగా వెతుక్కోవచ్చు. వయస్సు, వినియోగం ఆధారంగా సరైన క్రికెట్ బ్యాట్, జిమ్ గ్లోవ్స్ వంటి వస్తువులను సూచించే విధంగా ఈ ఫీచర్ పనిచేస్తోంది. అలాగే 'లెన్స్ ఏఐ' సదుపాయం ద్వారా కేవలం ఫొటో ఆధారంగా ఉత్పత్తులను గుర్తించి కొనుగోలు చేసే అవకాశం ఉంది. 'రివ్యూ హైలైట్స్' ద్వారా వినియోగదారుల అభిప్రాయాలను తెలుసుకోవచ్చు. 'ప్రైస్ హిస్టరీ' ఫీచర్‌తో ధరల మార్పులను కూడా గమనించవచ్చు. ఈ సేల్‌లో కొన్ని ప్రత్యేక ఆఫర్లు కూడా ఆకట్టుకుంటున్నాయి. కోకాటూ ఫుల్ క్రికెట్ సెట్ రూ.899కు, జస్పో ప్లాస్టిక్ బ్యాట్ రూ.329కు లభిస్తోంది. అలాగే విరాట్ కోహ్లీ బాబుల్ హెడ్ కలెక్టిబుల్ రూ.749కు అందుబాటులో ఉంది. మ్యాచ్‌లను థియేటర్ అనుభూతితో వీక్షించాలనుకునేవారి కోసం షియోమి 55 అంగుళాల 4కే టీవీ రూ.51,999కు విక్రయిస్తున్నారు. క్రికెట్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని తీసుకొచ్చిన ఈ ప్రత్యేక సేల్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు ఈ-కామర్స్ వర్గాలు చెబుతున్నాయి.

# కియా కార్లపై భారీ ఆఫర్లు.. రూ.2.70 లక్షల వరకు ప్రయోజనాలు

**వేద న్యూస్ డెస్క్:**



కొత్త కారు కొనాలని భావిస్తున్న వినియోగదారులకు కియా ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. మే 2026 సందర్భంగా సంస్థ తన పాపులర్ మోడళ్లపై భారీ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. కుటుంబంతో కలిసి లాంగ్ డ్రైవ్‌లు, టూర్స్‌కు అనువైన ఎస్‌యూవీలు, ఎమ్‌పీవీలపై రూ.2.70 లక్షల వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉంచింది. ఈ ప్రత్యేక ఆఫర్లలో క్యాష్ డిస్కౌంట్లతో పాటు ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, స్క్రాపేజ్ బెనిఫిట్స్, లాయల్టీ రివార్డులు, కార్పొరేట్ డిస్కౌంట్లు కూడా ఉన్నాయి. దీంతో కొత్త కారు కొనుగోలు చేయాలనుకునే వారికి మంచి అవకాశం లభిస్తోంది. కియా కార్నివాల్ కొనుగోలు చేసే కస్టమర్లకు మొత్తం రూ.2.70 లక్షల వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. విశాలమైన ఇంటీరియర్, ప్రీమియం ఫీచర్లతో ఇప్పటికే మంచి గుర్తింపు పొందిన ఈ లగ్జరీ ఎంపీవీపై కియా భారీ ఆఫర్లను ప్రకటించడం మార్కెట్లో చర్చనీయాంశమైంది. అలాగే కియా కేరెన్స్ క్లావిస్ టర్బో పెట్రోల్ వేరియంట్లపై రూ.1.55 లక్షల వరకు ప్రయోజనాలు అందిస్తున్నారు. దీనికి అదనంగా ఐదేళ్ల పొడిగించిన వారంటీని ఉచితంగా అందించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. డీజిల్, నాచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ వేరియంట్లపై రూ.85 వేల వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి చూపుతున్న కుటుంబ వినియోగదారులను ఆకర్షించేందుకు కియా కేరెన్స్ క్లావిస్ ఈవీపై ఏకంగా రూ.2.15 లక్షల వరకు ఆఫర్లు ప్రకటించారు. పర్యావరణహిత సాంకేతికతతో పాటు ఆధునిక ఫీచర్లు కోరుకునే వారికి ఈ మోడల్ మంచి ఎంపికగా నిలుస్తోంది. ఇక భారత మార్కెట్లో కియా బ్రాండ్‌కు అత్యధిక అమ్మకాలు తెచ్చిపెడుతున్న కియా సెల్టోస్ వీ25 స్టాక్‌పై రూ.95 వేల వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్లో హ్యుందాయ్ క్రెటా, టాటా సియెర్రా వంటి మోడళ్ల నుంచి తీవ్ర పోటీ ఉన్న నేపథ్యంలో సెల్టోస్ విక్రయాలను మరింత పెంచేందుకు ఈ ఆఫర్లు దోహదపడనున్నాయని ఆటో విశ్లేషకులు భావిస్తున్నారు. వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రకటించిన ఈ ఆఫర్లు పరిమిత కాలానికి మాత్రమే వర్తించే అవకాశం ఉండటంతో వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు.

# ఏఐ ప్రభావంతో కోట్ల ఉద్యోగాలకు ముప్పు: సౌరభ్ హెచ్చరిక




**వేద న్యూస్ డెస్క్:**

భారత్‌లో వైట్ కాలర్ ఉద్యోగాలకు రాబోయే సంవత్సరాల్లో తీవ్ర ముప్పు పొంచి ఉందని ప్రముఖ మార్కెట్ నిపుణుడు సౌరభ్ ముఖర్జీయా హెచ్చరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తుండటంతో, ప్రస్తుతం మనుషులు చేస్తున్న అనేక పనులను కంపెనీలు ఆటోమేట్ చేసే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దీంతో కోట్లాది ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన సౌరభ్ ముఖర్జీయా.. ఏఐ ప్రభావం టెక్నాలజీ రంగానికే పరిమితం కాదని, భవిష్యత్తులో అన్ని రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం టెక్ కంపెనీల్లో కనిపిస్తున్న ఉద్యోగ కోతలు కేవలం ప్రారంభ సంకేతాలేనని, అసలు ప్రభావం ఇంకా ముందుందని వ్యాఖ్యానించారు. 2030 నాటికి భారత్‌లో సుమారు 1.8 కోట్ల వైట్ కాలర్ ఉద్యోగాలు ఏఐ కారణంగా మాయమయ్యే అవకాశముందని ఆయన అంచనా వేశారు. మరోవైపు కొత్తగా కేవలం 30 లక్షల టెక్ ఉద్యోగాలే సృష్టించబడతాయని పేర్కొన్నారు. ఈ లెక్కన దాదాపు 1.5 కోట్ల ఉద్యోగాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కోడింగ్, డేటా విశ్లేషణ, డిజిటల్ టాస్క్‌ల వంటి రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోందని సౌరభ్ చెప్పారు. ఇప్పటికే కొన్ని కంపెనీలు మానవ వనరుల అవసరాన్ని గణనీయంగా తగ్గిస్తున్నాయని, ప్రస్తుతం ఇది 50 శాతం వరకు ప్రభావం చూపుతోందన్నారు. మరో రెండు నుంచి మూడు సంవత్సరాల్లో ఈ స్థాయి 90 నుంచి 100 శాతం వరకు చేరే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఏఐ అభివృద్ధి కారణంగా కంపెనీలు ఖర్చులను తగ్గించుకునే అవకాశాలు పెరుగుతున్నప్పటికీ, అదే సమయంలో భారీ స్థాయిలో ఉద్యోగ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఐటీ, ఫైనాన్స్, కస్టమర్ సపోర్ట్, డేటా ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన అవసరం పెరుగుతోందని విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే కొందరు నిపుణులు మాత్రం ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాలు కనుమరుగైనా, కొత్త తరహా అవకాశాలు కూడా పుట్టుకొస్తాయని చెబుతున్నారు. టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

# హార్దిక్ కెప్టెన్సీపై జాఫర్ సంచలన వ్యాఖ్యలు




**వేద న్యూస్ డెస్క్:**

ముంబై ఇండియన్స్ ఐపీఎల్ 2026 సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు చేరుకోకముందే టోర్నీ నుంచి నిష్క్రమించడంతో జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జట్టు ప్రదర్శనతో పాటు వ్యక్తిగతంగా కూడా హార్దిక్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో వచ్చే సీజన్‌లో అతను కెప్టెన్‌గా కొనసాగకూడదని కొంతమంది మాజీ క్రికెటర్లు, అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఈ సీజన్‌లో హార్దిక్ ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో కేవలం 146 పరుగులు మాత్రమే చేసి, మూడు వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ఈ నేపథ్యంలో భారత మాజీ బ్యాటర్ వసీం జాఫర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన జాఫర్.. "నేను హార్దిక్‌ను కెప్టెన్‌గా కొనసాగించను. కానీ అతడిని జట్టులో మాత్రం తప్పకుండా ఉంచుతాను. తన ఆటపై పూర్తిగా దృష్టి పెట్టి మళ్లీ అత్యుత్తమ ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నాను" అని వ్యాఖ్యానించాడు. హార్దిక్ స్థానంలో ఎవరిని కెప్టెన్‌గా నియమిస్తారని అడిగిన ప్రశ్నకు జాఫర్ సమాధానమిస్తూ.. "ప్రస్తుత పరిస్థితుల్లో సరైన కెప్టెన్ ఎంపిక చేయడం కష్టం" అని పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా, ఈ సీజన్‌లో తమ చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో 30 పరుగుల తేడాతో ఓడిన ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే జట్టు వైఫల్యానికి కేవలం హార్దిక్ ఒక్కరినే కారణం చేయలేమని ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్ స్పష్టం చేశాడు. "ఫ్రాంచైజీగా మేము ఆశించిన ఫలితాలు రాలేదు. హార్దిక్ నాయకత్వంలో జట్టు రాణించేందుకు అన్ని విధాలా ప్రయత్నించాం. ఇది ఒకరి తప్పిదం కాదు.. మొత్తం జట్టు వైఫల్యం" అని పొలార్డ్ పేర్కొన్నాడు.

# మెస్సీ గాయంతో అర్జెంటీనాకు భారీ షాక్

**వేద న్యూస్ డెస్క్:**



అర్జెంటీనా జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. జట్టు కెప్టెన్ లియోనల్ మెస్సీ తొడ కండరాల గాయంతో బాధపడుతున్నట్లు సమాచారం రావడంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఫిఫా ప్రపంచకప్ ప్రారంభానికి ముందు ఈ గాయం తలెత్తడం అర్జెంటీనా జట్టుకు పెద్ద సమస్యగా మారింది. గత ప్రపంచకప్‌లో ఖతార్ వేదికగా జరిగిన ఫైనల్లో ఫ్రాన్స్ జాతీయ ఫుట్‌బాల్ జట్టుపై అద్భుత ప్రదర్శనతో అర్జెంటీనాకు టైటిల్ అందించిన మెస్సీ.. ఈసారి కూడా జట్టుకు కీలక బలంగా భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆయన గాయపడటంతో ప్రపంచకప్‌లో ఆడగలడా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఇంటర్ మియామి తరఫున ఆడుతున్న మెస్సీ.. మేజర్ లీగ్ సాకర్‌లో ఫిలడెల్ఫియా యూనియన్తో జరిగిన మ్యాచ్ సందర్భంగా గాయపడ్డాడు. మ్యాచ్ మధ్యలోనే ఎడమ తొడ కండరాల్లో నొప్పితో బాధపడుతూ మైదానాన్ని వీడినట్లు క్లబ్ వెల్లడించింది. వైద్య పరీక్షల అనంతరం మెస్సీ కండరాల అలసటతో పాటు తొడ భాగంలో సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించినట్లు సమాచారం. ఈ గాయం నుంచి కోలుకోవడానికి కొన్ని రోజులు లేదా వారాలు పట్టే అవకాశముందని క్లబ్ ప్రకటనలో తెలిపింది. జూన్ 11 నుంచి ప్రారంభమయ్యే ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనా తన తొలి మ్యాచ్‌ను జూన్ 16న అల్జీరియా జాతీయ ఫుట్‌బాల్ జట్టుతో ఆడనుంది. ఈలోపు మెస్సీ పూర్తిగా కోలుకుంటాడా లేదా అన్నదానిపై ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సింగపూర్ ఓపెన్‌లో భారత షట్లర్ల సవాల్

**వేద న్యూస్ డెస్క్:**




ప్రపంచ బ్యాడ్మింటన్ వేదికపై ప్రతిష్ఠాత్మకంగా భావించే సింగపూర్ ఓపెన్ సూపర్750కు రంగం సిద్ధమైంది. మంగళవారం ప్రారంభమయ్యే ఈ మెగా టోర్నీలో భారత స్టార్ షట్లర్లు టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. ముఖ్యంగా పీవీ సింధు, లక్ష్య సేన్పై అభిమానుల దృష్టి నెలకొంది. మహిళల సింగిల్స్ విభాగంలో రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత అయిన సింధు తొలి రౌండ్‌లో ఇండోనేషియాకు చెందిన పుత్రి కుసుమవర్ధానితో తలపడనుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ చైనాకు చెందిన గుయాంగ్ జుతో పోటీ పడనున్నాడు. తొలి మ్యాచ్‌లే కఠినంగా ఉండటంతో భారత స్టార్ ఆటగాళ్లకు ఇది కీలక పరీక్షగా మారింది. ఈ టోర్నీలో భారత్ తరఫున మరికొంత మంది అగ్రశ్రేణి ఆటగాళ్లు కూడా బరిలోకి దిగుతున్నారు. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్. ప్రణయ్, యువ ఆటగాడు ఆయుష్ శెట్టి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.ఎ మహిళల విభాగంలో ఉన్నతి హుడా, మాళవిక బన్సోద్ కూడా పోటీకి సిద్ధమయ్యారు. ఇక పురుషుల డబుల్స్‌లో ప్రపంచ స్థాయి జోడీగా గుర్తింపు పొందిన సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి చిరాగ్ శెట్టి జోడీ మరో అంతర్జాతీయ టైటిల్ కోసం బరిలోకి దిగుతోంది. భారత అభిమానులు ఈసారి సింగపూర్ వేదికపై మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నారు.

# ఇన్‌స్టా పోస్టులు డిలీట్ చేసిన అర్ష్‌దీప్..

**వేద న్యూస్ డెస్క్:**




అర్ష్‌దీప్ సింగ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఉన్న దాదాపు 200 పోస్టులను అకస్మాత్తుగా తొలగించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా తన డిస్‌ప్లే ఫొటోను కూడా మార్చడంతో అభిమానుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా విరాట్ కోహ్లీతో కలిసి చేసిన రీల్‌ను కూడా ఆయన తొలగించారు. ఆ వీడియోకు కోట్లలో వ్యూస్ వచ్చినట్లు సమాచారం. అయితే పోస్టులను ఎందుకు తొలగించారనే విషయంపై అర్ష్‌దీప్ ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. వ్యక్తిగత కారణాలతో సోషల్ మీడియా క్లీనప్ చేపట్టాడా? లేక కొత్త ఇమేజ్ కోసం రీబ్రాండింగ్ ప్రయత్నం చేస్తున్నాడా? అనే చర్చలు అభిమానుల్లో కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా పంజాబ్ కింగ్స్కు సంబంధించిన పోస్టులను మాత్రం అర్ష్‌దీప్ తొలగించలేదు. తన బయోలో కూడా పంజాబ్ కింగ్స్ ఆటగాడిగానే కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో దిగిన ఫొటోలు, కెరీర్ మైలురాళ్లు, బ్రాండ్ ప్రమోషన్లకు సంబంధించిన కొన్ని పోస్టులు మాత్రం ఇంకా ఖాతాలో కనిపిస్తున్నాయి.

వేద న్యూస్

బుధవారం మే 27 , 2026

# ‘దేవర’ టీవీ ప్రీమియర్‌పై క్లారిటీ..




**వేద న్యూస్ డెస్క్:**

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా, జాన్వీ కపూర్ కథానాయికగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం ‘దేవర’ విడుదల సమయంలో దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే.

సముద్ర తీర ప్రాంత నేపథ్యంతో యాక్షన్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్ కలగలిపి రూపొందిన ఈ చిత్రం థియేటర్లలో మంచి విజయాన్ని అందుకోవడంతో పాటు ఓటీటీ వేదికలపై కూడా భారీ స్థాయిలో ప్రేక్షకాదరణ పొందింది. అయితే సినిమా విడుదలై చాలా నెలలు గడిచినా వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా ‘దేవర’ శాటిలైట్ హక్కులను ఏ ఛానల్ సొంతం చేసుకుందనే అంశం చాలా రోజులుగా టాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆ సస్పెన్స్‌కు తెరపడినట్లు సమాచారం. ప్రముఖ టెలివిజన్ నెట్‌వర్క్ ఈటీవీ ఈ చిత్రానికి సంబంధించిన శాటిలైట్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో త్వరలోనే ‘దేవర’ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ ప్రసారం కానున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. సాధారణంగా భారీ సినిమాల టీవీ ప్రీమియర్‌లను పండుగ సీజన్లలో ప్రసారం చేసేలా ప్లాన్ చేస్తుంటారు. దసరా, దీపావళి లేదా సంక్రాంతి వంటి ప్రత్యేక సందర్భాల్లో ప్రసారం చేస్తే కుటుంబ ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని టీవీ ఛానళ్లు భావిస్తాయి. అదే విధంగా ‘దేవర’ను కూడా ఒక భారీ పండుగ సందర్భంగా టెలికాస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఎన్టీఆర్‌కు ఉన్న ఫ్యాన్ బేస్, సినిమాకు వచ్చిన మాస్ రెస్పాన్స్ దృష్ట్యా టీఆర్పీ పరంగా కూడా ఈ చిత్రం రికార్డులు సృష్టించే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అమ్మ జ్ఞాపకాలతో భావోద్వేగానికి గురైన శ్రీ గౌరి ప్రియ

**వేద న్యూస్ డెస్క్:**



తెలుగు సినీ పరిశ్రమలో విభిన్న పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ మరోసారి వార్తల్లో నిలిచింది. సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి ‘చెన్నై లవ్ స్టోరీ’ చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన ‘వదలనే’ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు అందరినీ కదిలించాయి. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించిన ‘వదలనే’ పాట విడుదల కార్యక్రమంలో చిత్ర బృందం మొత్తం పాల్గొంది. ఈ సందర్భంగా వ్యాఖ్యాత స్రవంతి చొక్కారపు వేదికపై ఉన్న నటీనటులను ఉద్దేశించి “ఈ పాటలోని సాహిత్యాన్ని ఎవరికి అంకితం చేస్తారు?” అని ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే క్రమంలో శ్రీ గౌరి ప్రియ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. “నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు.. నాకు తెలుసు. ఈ పాటలోని ప్రతి లైన్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను” అంటూ ఆమె కన్నీటి గొంతుతో చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు మౌనంగా మారిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతోంది. అభిమానులు, సినీ ప్రేక్షకులు శ్రీ గౌరి ప్రియ ధైర్యాన్ని ప్రశంసిస్తూ స్పందిస్తున్నారు. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా కన్నుమూశారు. తల్లితో తనకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉండేదని ఆమె ఇప్పటికే పలు ఇంటర్వ్యూల్లో వెల్లడించింది. కేవలం తల్లిగానే కాకుండా మంచి స్నేహితురాలిలా తనతో ఉండేదని, ప్రతి విషయాన్ని పంచుకునేదని చెప్పింది. తల్లి మరణం తర్వాత కొంతకాలం తీవ్ర మానసిక వేదన అనుభవించిన శ్రీ గౌరి ప్రియ.. ఆ బాధను అధిగమించి మళ్లీ తన నటనా ప్రయాణంపై దృష్టి పెట్టింది. ఇప్పటికే ‘మెయిల్’, ‘మోడర్న్ లవ్ చెన్నై’, ‘మ్యాడ్’, ‘రైటర్ పద్మభూషణ్’, ‘లవర్’, ‘హ్యాపీ రాజ్’ వంటి చిత్రాల ద్వారా ప్రేక్షకులకు చేరువైన శ్రీ గౌరి ప్రియ.. ఇప్పుడు వరుస అవకాశాలతో బిజీగా మారింది. ప్రస్తుతం ‘చెన్నై లవ్ స్టోరీ’తో పాటు ‘వీసా వింటారా సరదాగా’, ‘బ్రో కోడ్’ వంటి చిత్రాల్లో నటిస్తోంది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ‘చెన్నై లవ్ స్టోరీ’ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై యువ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

# ‘ప్రియసఖి’తో మళ్లీ మ్యాజిక్ చేస్తున్న ఆనంద్-వైష్ణవి జోడీ

**వేద న్యూస్ డెస్క్:**




యువ నటుడు ఆనంద్ దేవరకొండ, నటి వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కుతున్న తాజా ప్రేమకథా చిత్రం ‘ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్’పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. సూపర్ హిట్ ‘90స్’ వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే టైటిల్‌తోనే యువతలో ప్రత్యేక ఆకర్షణను సొంతం చేసుకుంది. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన తొలి గీతం ‘ప్రియసఖి’ ఇప్పుడు సంగీత ప్రియులను ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత సంస్థ ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలైన ఈ లిరికల్ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పాట పూర్తి స్థాయి మెలోడియస్ ఫీల్‌తో సాగుతూ యువత మనసులను తాకుతోంది. ప్రేమలో పడిన ఓ యువకుడి భావోద్వేగాలను, అతని జీవితంలోకి వచ్చిన అమ్మాయి కారణంగా చోటుచేసుకునే అందమైన మార్పులను ఈ గీతంలో ఎంతో హృద్యంగా చూపించారు. “సూర్యుడు ఎరుగని కొత్త కాంతి ఇది.. చంద్రుడు చూడని కొత్త వెన్నెలిది.. భూమికి తెలియని మట్టి వాసనిది ఏమిది ఏమిది” వంటి పల్లవులు శ్రోతలను ఆకట్టుకుంటుండగా, “జీవితాన్ని మార్చేసావే బుజ్జి నెమలి.. స్వర్గంలోతూ చూపించవే పూలకడలి” వంటి లైన్లు ప్రేమలోని మాధుర్యాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తున్నాయి. పాటలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మధ్య కనిపించిన కెమిస్ట్రీ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. గతంలో ‘బేబీ’ చిత్రంతో ఈ జంట ప్రేక్షకులను ఎంతగానో మెప్పించింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరూ కలిసి నటిస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి రెట్టింపైంది. ‘ప్రియసఖి’ పాటలో కనిపించిన భావోద్వేగాలు, విజువల్స్, యువతకు దగ్గరగా ఉండే ప్రేమ సంభాషణలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రాన్ని యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. కాలేజీ నేపథ్యంలో సాగే ఈ కథలో ప్రేమ, స్నేహం, భావోద్వేగాలు ప్రధానాంశాలుగా ఉండనున్నాయని సమాచారం. ముఖ్యంగా నేటి తరం యువత అనుభూతులకు దగ్గరగా ఉండే అంశాలను సినిమాలో బలంగా చూపించనున్నారని టాక్ వినిపిస్తోంది. ఎఫస్ట్ సింగిల్ విడుదల తర్వాత ‘ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్’పై సోషల్ మీడియాలో చర్చ మరింత పెరిగింది. పాటలోని సంగీతం, సాహిత్యం, విజువల్స్ అన్నీ కలిపి సినిమా మంచి ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా నిలవబోతుందనే అభిప్రాయాన్ని ప్రేక్షకుల్లో కలిగిస్తున్నాయి. ఇక త్వరలో విడుదల కానున్న టీజర్, ట్రైలర్‌తో ఈ చిత్రంపై మరింత హైప్ పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# థియేటర్ పర్సంటేజ్ వివాదంపై రంగంలోకి చిరంజీవి



**వేద న్యూస్ డెస్క్:**

తెలుగు సినీ పరిశ్రమలో థియేటర్ పర్సంటేజ్ విధానం చుట్టూ నెలకొన్న వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి స్వయంగా రంగంలోకి దిగడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం ‘పెద్ది’ విడుదలకు ముందు నుంచే కొత్త పర్సంటేజ్ విధానాన్ని అమలు చేయాలన్న డిమాండ్ బలపడుతున్న వేళ, తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లో చిరంజీవిని కలిసి కీలక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా థియేటర్లలో అమలవుతున్న రెంటల్ విధానం, పర్సంటేజ్ షేరింగ్ వ్యవస్థ, సింగిల్ స్క్రీన్ థియేటర్ల ఆర్థిక ఇబ్బందులు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భారీ సినిమాలు విడుదలైనప్పటికీ థియేటర్లకు ఆశించిన లాభాలు రావడం లేదని, ముఖ్యంగా చిన్న పట్టణాల్లోని సింగిల్ స్క్రీన్ యజమానులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఎగ్జిబిటర్లు చిరంజీవి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇకపై రెంటల్ విధానానికి బదులుగా పర్సంటేజ్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తేనే థియేటర్లు నిలబడగలవని వారు అభిప్రాయపడ్డారు. ఈ భేటీలో ఫిలిం చాంబర్ అధ్యక్షుడు సురేష్ బాబు, ప్రముఖ నిర్మాత కేఎల్ నారాయణ, నిర్మాత దిల్ రాజు తదితరులు కూడా తమ అభిప్రాయాలను చిరంజీవికి వివరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారీ బడ్జెట్ సినిమాల విడుదల సమయంలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, థియేటర్ల మధ్య ఏర్పడుతున్న ఆర్థిక ఒత్తిడిని తగ్గించేలా ఒక సమగ్ర విధానం అవసరమని వారు పేర్కొన్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు గంటకు పైగా సాగిన ఈ కీలక సమావేశం అనంతరం చిరంజీవి సినీ నిర్మాతల గిల్డ్ సభ్యులతో కూడా ప్రత్యేకంగా మాట్లాడారు. సమావేశం తర్వాత నిర్మాత దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ.. “చిరంజీవి గారు పరిశ్రమ సమస్యను చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ఎగ్జిబిటర్ల ఆవేదనను పూర్తిగా అర్థం చేసుకున్నారు. రెండ్రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం దొరికేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు” అని తెలిపారు. ఇప్పటికే ఫిలిం చాంబర్ ఈ అంశంపై ఒక ప్రత్యేక కమిటీని నియమించిందని, ఆ కమిటీ సమర్పించిన నివేదికను చిరంజీవి పరిశీలించనున్నట్లు దిల్ రాజు వెల్లడించారు. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లందరికీ న్యాయం జరిగేలా ఒక సమతుల్య నిర్ణయం తీసుకునే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇక మరోవైపు సినీ పరిశ్రమలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాజకీయ స్థాయిలో కూడా చర్చలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో సినీ నిర్మాతలు త్వరలో భేటీ కానున్నారు. ఈ సమావేశంలో థియేటర్ పర్సంటేజ్ విధానం, టికెట్ ధరలు, చిన్న సినిమాల విడుదల సమస్యలు, థియేటర్ల నిర్వహణ ఖర్చులు వంటి కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం ఓటీటీ ప్రభావం, పెరుగుతున్న నిర్వహణ వ్యయాలు, ప్రేక్షకుల అలవాట్లలో మార్పులు వంటి కారణాలతో థియేటర్ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో పరిశ్రమ పెద్దలు ముందుకొచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయడం సినీ వర్గాల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ముఖ్యంగా చిరంజీవి జోక్యం తర్వాత ఈ వివాదానికి త్వరలోనే ముగింపు పలికే అవకాశం ఉందని టాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ‘అర్జున్ రెడ్డి’ భామ

**వేద న్యూస్ డెస్క్:**



ఒక్క సినిమా జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది అంటారు. కానీ కొన్నిసార్లు భారీ విజయంతో వచ్చిన గుర్తింపు కూడా నటీనటుల కెరీర్‌ను ఎక్కువ కాలం నిలబెట్టలేకపోతుంది. అలాంటి ఉదాహరణల్లో నటి షాలిని పాండే ఒకరు. యువ హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వచ్చిన ‘అర్జున్ రెడ్డి’ చిత్రం ఎంతటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ సినిమాతో విజయ్ స్టార్ హీరోగా, సందీప్ స్టార్ దర్శకుడిగా ఒక్కరాత్రిలోనే మారిపోయారు. అదే చిత్రంలో అమాయకపు యువతిగా నటించిన షాలిని పాండే కూడా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. అయితే ఆమె కెరీర్ మాత్రం ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. ‘అర్జున్ రెడ్డి’లో ప్రీతి పాత్రలో షాలిని చూపించిన అమాయకత్వం, భావోద్వేగ నటన ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. తొలి సినిమాతోనే ఆమెకు మంచి భవిష్యత్తు ఉంటుందని సినీ వర్గాలు అంచనా వేశాయి. కానీ ఆ తర్వాత వచ్చిన అవకాశాలు మాత్రం ఆమె కెరీర్‌ను నిలబెట్టలేకపోయాయి. తెలుగు చిత్రాల్లో కొన్ని అవకాశాలు వచ్చినప్పటికీ అవి పెద్ద విజయాలను అందుకోలేదు. దీంతో ఆమెకు స్టార్ హీరోయిన్ స్థాయి దక్కలేదు. తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లో కూడా షాలిని నటించింది. కానీ అక్కడ కూడా ఆమెకు అదృష్టం కలిసి రాలేదు. వరుసగా సినిమాలు చేసినప్పటికీ సరైన విజయాలు లేకపోవడంతో కెరీర్ నెమ్మదించింది. తర్వాత బాలీవుడ్‌పై దృష్టి పెట్టిన ఈ భామ అక్కడ కూడా పలు చిత్రాల్లో నటించింది. కానీ హిందీ ప్రేక్షకుల నుంచి కూడా ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. దీంతో ప్రస్తుతం ఆమెకు సినిమా అవకాశాలు తగ్గిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. సినిమాల్లో అవకాశాలు తగ్గినా సోషల్ మీడియాలో మాత్రం షాలిని పాండే మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది. ఒకప్పుడు కాస్త బొద్దుగా కనిపించిన ఆమె ఇప్పుడు పూర్తిగా మారిపోయి సన్నగా, మరింత గ్లామరస్‌గా కనిపిస్తోంది. తరచూ ఫోటోషూట్లు చేస్తూ సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆధునిక దుస్తుల్లో, స్టైలిష్ లుక్స్‌తో ఆమె పంచుకుంటున్న ఫోటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఆమె షేర్ చేస్తున్న గ్లామర్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. “ఇంత అందంగా ఉన్నా అవకాశాలు ఎందుకు రావడం లేదు?”, “మళ్లీ మంచి కంబ్యాక్ ఇవ్వాలి” అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఆమె నటనకు సరైన పాత్రలు దొరకలేదని అభిప్రాయపడుతున్నారు. తొలి సినిమాతోనే స్టార్‌డమ్ అందుకున్నప్పటికీ.. ఆ తర్వాత వరుస ఫ్లాపులు షాలిని కెరీర్‌ను దెబ్బతీశాయి. అయినప్పటికీ ఆమె సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లోనే ఉంది. ఇప్పుడు మళ్లీ సరైన కథ, బలమైన పాత్రతో తెలుగు తెరపైకి రావాలని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు. మరి షాలిని పాండే మరోసారి టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారుతుందా లేదా అన్నది చూడాలి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073